27-08-2021 ప్రాత:మురళి ఓంశాంతి "బాప్ దాదా" మధువనం

"మధురమైన పిల్లలూ - ఇప్పుడు ఈ అనంతమైన పాత ప్రపంచం యొక్క వినాశనం జరగనున్నది, కొత్త ప్రపంచం స్థాపన అవుతుంది, అందుకే, కొత్త ప్రపంచంలోకి వెళ్ళేందుకు పవిత్రంగా అవ్వండి"

ప్రశ్న:- పరమాత్మ గురించి మనుష్యులు అర్థం చేసుకోలేని ఏ అద్భుతమైన విషయము పిల్లలైన మీకు తెలుసు?

జవాబు:- ఎలాగైతే ఆత్మ జ్యోతిర్బిందువో, అలా పరమాత్మ కూడా అతి సూక్ష్మమైన జ్యోతిర్బిందువు అని మీరంటారు. ఈ అద్భుతమైన విషయాలు మనుష్యుల బుద్ధి పరిధికి అతీతమైనవి. ఎంతో మంది పిల్లలు కూడా ఈ విషయంలో తికమకపడతారు. బాబా అంటారు - పిల్లలూ, తికమకపడకండి, ఒకవేళ చిన్న రూపంలో స్మృతి చేయలేకపోతే, పెద్ద రూపంలో స్మృతి చేయండి. స్మృతి తప్పకుండా చేయాలి.

గీతము:- రాత్రి ప్రయాణీకుడా అలసిపోకు..... (రాత్ కే రాహీ థక్ మత్ జానా.....)

ఓంశాంతి. ఆత్మిక పిల్లలకు ఆత్మిక తండ్రి కూర్చుని అర్థం చేయిస్తారు కనుక పిల్లలు ఆత్మాభిమానులుగా అయి కూర్చోవాలి. ఈ విధంగా మరెక్కడా అర్థం చేయించరు. ఆత్మాభిమానులుగా కూర్చోండి అని ఏ సాధు-సత్పురుషులు అర్థం చేయించరు. ఒక్క తండ్రి మాత్రమే ఇలా అర్థం చేయిస్తారు. ఇంకెవరికీ ఇలా చెప్పడం రాదు. ఈ యుక్తిని ఎవరూ తెలియజేయలేరు. మనం ఆత్మలము అని పిల్లలైన మీరు కూడా అర్థం చేసుకున్నారు. ఆత్మయే ఒక శరీరాన్ని వదిలి ఇంకొకటి తీసుకుంటుంది. ఒకసారి బ్యారిస్టరుగా, మరోసారి డాక్టరుగా అవుతుంది. ఆత్మయే ఇప్పుడు పతితంగా అయ్యింది, మళ్ళీ పావనంగా అవుతుంది. ఆత్మలో జ్ఞాన ధారణ జరుగుతుంది. నిరాకారుడైన తండ్రి జ్ఞానసాగరుడు కనుక వారు తప్పకుండా వచ్చి జ్ఞానాన్ని వినిపిస్తారు కదా! వారు పతితపావనుడు కనుక తప్పకుండా వచ్చి పావనంగా తయారుచేస్తారు. వారు సుప్రీమ్ పరమపిత పరమాత్మ. మీ తండ్రినైన నేను సుప్రీమ్ ను, జ్ఞానసాగరుడను. నాకు నా శరీరమంటూ లేదు. ఈ జ్ఞానమంతటినీ మీ ఆత్మ ధారణ చేస్తుంది కనుక మీరు ఆత్మాభిమానులుగా అవ్వాలి. దేహాభిమానం ఉండకూడదు. వినేవారు మరియు వినిపించేవారు, ఇరువురూ దేహీ-అభిమానులుగా ఉండే స్థానం ఇంకేదీ లేదు. తండ్రి అయితే ఎలాగూ నిరాకారుడు. వారు వచ్చి మీకు రాజయోగాన్ని నేర్పిస్తారు. మిగితా మనుష్యులందరూ దేహాభిమానులు. ఈ లక్ష్మీనారాయణుల కొరకు ఏమంటారంటే - వీరు ఆత్మాభిమానులుగా ఉండేవారు కానీ ఎంతైనా దేహభానం ఉంటుంది కదా! ఈ జ్ఞానాన్ని పరమపిత పరమాత్మయే వచ్చి ఇస్తారు. ఆత్మ ధారణ చేయాల్సి ఉంటుంది. ఆత్మకే పతితం నుండి పావనంగా అయ్యే యుక్తిని తెలియజేస్తారు. ఇప్పుడు ప్రపంచమంతా పతనావస్థలో ఉంది, దీనిని మళ్ళీ ఉన్నతిలోకి తీసుకువెళ్ళేందుకు తండ్రి వస్తారు. ఈ విషయం పిల్లలైన మీకు తెలుసు. పతనము అనగా వినాశనము, ఉన్నతి అనగా నిర్మాణము. స్థాపన మరియు వినాశనము. దేని స్థాపన? కొత్త ప్రపంచ స్థాపన, స్వర్గ స్థాపన మరియు పాత ప్రపంచము, నరకము యొక్క వినాశనము. వినాశనము మరియు నిర్మాణము. కలియుగం పాత ప్రపంచము, ఇది తప్పకుండా వినాశనం అవ్వాలి. వినాశనానికి గుర్తు - ఈ మహాభారీ మహాభారత యుద్ధము. మహాభారత వృత్తాంతాన్ని మహాభారత శాస్త్రంలో చూపిస్తారు. తండ్రి, బ్రహ్మ ద్వారా స్థాపన చేస్తారు కనుక తప్పకుండా కొత్త ప్రపంచాన్నే స్థాపన చేస్తారు కదా. ఇది అనంతమైన వినాశనం మరియు అనంతమైన స్థాపన. తండ్రియే పిల్లల కోసం కొత్త ఇంటిని నిర్మిస్తారు, తర్వాత పాతదానిని తప్పకుండా సమాప్తం చేయిస్తారు. ఇప్పుడు బాబా కొత్త ప్రపంచ స్థాపన చేస్తున్నారని మీరు అర్థం చేసుకుంటారు. తమోప్రధానం నుండి మళ్ళీ సతోప్రధానంగా అయ్యేందుకు మనల్ని తయారుచేస్తున్నారు. వినాశనం కొరకు మహాభారత యుద్ధం ప్రసిద్ధి గాంచినది. ఇప్పుడిది ఆ సమయమేనని, మహాభారత సమయంలో ఉన్న ఆ నక్షత్రాలే ఇప్పుడు మళ్ళీ పరస్పరంలో కలిసాయని అంటారు. భారత్ యొక్క ఉన్నతి మరియు పతనానికి సంబంధించిన అద్భుత కథ అని ఈ మెట్ల చిత్రంలో కూడా వ్రాయబడి ఉంది. ఈ వాక్యంలో 'కల్ప-కల్పము' అనే పదము కూడా రావాలి. ప్రారంభం నుండి అంతిమం వరకు మనుష్యులు 84 జన్మలు తీసుకుంటారు. ఈ విషయం కూడా మీ బుద్ధిలో ఉంది. మనుష్యుల బుద్ధికి పూర్తిగా గోద్రెజ్ తాళం వేయబడి ఉంది. మనుష్యులు ఈ విషయాలను తెలుసుకోవాలి. ఆత్మలు పాత్రను అభినయించేందుకు ఇక్కడ శరీరాలను ధారణ చేస్తాయి. కనుక డ్రామా ఆదిమధ్యాంతాల యొక్క క్రియేటర్, డైరెక్టర్, ముఖ్యమైన పాత్రధారులు మొదలైనవారి గురించి తెలుసుకోవాలి కదా! ఇప్పుడు మీకు డ్రామా ఆదిమధ్యాంతాలు, ఎవరు ఏమిటి అని ప్రారంభం నుండి అంతిమం వరకు మొత్తం డ్రామా గురించి తెలిసింది. తండ్రి ద్వారా ఈ జ్ఞానమంతా లభిస్తుంది. సృష్టి చక్రం ఎలా తిరుగుతుంది అనేది కూడా తెలుస్తుంది. దీనిని ఆత్మిక జ్ఞానమని అంటారు. భౌతిక జ్ఞానాన్ని ఫిలాసఫీ అని అంటారు. ఆధ్యాత్మిక జ్ఞానాన్ని, ఆత్మిక

జ్ఞానాన్ని జ్ఞానమని అంటారు. ఇప్పుడు ఈ విషయాలన్నింటినీ పిల్లల బుద్ధిలో కూర్చోబెట్టారు.

ఇప్పుడు 84 జన్మల నాటకం పూర్తవుతుందని పిల్లలకు తెలుసు. ఇప్పుడు మనం తిరిగి వెళ్తాము కానీ పతితులెవ్వరూ తిరిగి వెళ్ళలేరు. లేదంటే ఇన్ని జప తపాలు, తీర్థయాత్రలు మొదలైనవి ఎందుకు చేస్తారు. పవిత్రంగా అయ్యేందుకే గంగా స్నానాలు చేయడానికి వెళ్తారు కానీ వాటివల్ల ఎవరూ పావనంగా అవ్వలేరు, అందుకే ఎవరూ తిరిగి వెళ్ళలేరు. ఫలానావారు నిర్వాణధామానికి వెళ్ళారని, జ్యోతి జ్యోతిలో కలిసిపోయిందని చాలా ప్రగల్భాలు పలుకుతూ ఉంటారు. ఎవ్వరూ తిరిగి వెళ్ళరని తండ్రి అర్థం చేయించారు. పాత్రధారులందరూ ఇక్కడే ఉన్నారు. ఇప్పుడు నాటకం పూర్తవుతుంది కనుక అందరూ స్టేజిపై నిలబడి ఉన్నారు. ఇప్పుడు అందరూ ఇక్కడ హాజరై ఉన్నారు. బౌద్ధులు, క్రిస్టియన్లు మొదలైనవారు ఎక్కడున్నారు అనేది మనుష్యులకు తెలియదు. పై నుండి ఇక్కడకు వచ్చిన ఆత్మలందరూ ఈ సమయంలో తమోప్రధానంగా ఉన్నారని మీరు అర్థం చేసుకున్నారు. తమోప్రధానం నుండి సతోప్రధానంగా, కల్పక్రితం కూడా అయ్యారు. తండ్రియే వచ్చి స్థాపన మరియు వినాశనం చేయిస్తారు. ఈ జ్ఞానం రాజులకే రాజులుగా తయారుచేస్తుందని కూడా అంటారు. నేను మిమ్మల్ని రాజులకే రాజులుగా తయారుచేస్తానని ఈ అనంతమైన తండ్రి అన్నారు. కృష్ణుడు స్థాపన చేయించరు. రచయిత తండ్రియే. తండ్రియే వచ్చి అర్థం చేయిస్తారు - సృష్టి పతితంగా అయినప్పుడు మీరు నన్ను పిలుస్తారు, అలాగని నేను కొత్త సృష్టిని రచిస్తాననీ కాదు. ప్రళయం జరిగినట్లుగా చూపిస్తారు కానీ అదంతా తప్పు. మనుష్యులు, ఓ పతిత పావనా రండి, అని పిలుస్తారు కనుక తప్పకుండా పతిత ప్రపంచంలోకే వస్తారు కదా! తండ్రియే వచ్చి కృష్ణపురి సాక్షాత్కారాన్ని చేయిస్తారు. కృష్ణుడు సాగరంలో రావి ఆకుపై వచ్చారని చూపిస్తారు. ఇది కరక్టే. కొత్త ప్రపంచంలో మొట్టమొదట కృష్ణుడే వస్తారు. సాగరం నుండి కాదు, గర్భ మహలు నుండి వస్తారు. బొటనవేలు నోటిలో పెట్టుకుని, చాలా ప్రశాంతంగా గర్భ మహలులో ఉంటారు. సత్యయుగంలో ఉండే పిల్లలందరూ గర్భ మహలులో ఉంటారు. వారు గర్భ మహలు విషయాన్ని సాగరంలో ఆకుపై కూర్చున్నట్లుగా చూపించారు. అవన్నీ భక్తి మార్గపు విషయాలు. తండ్రి కూర్చుని ఈ శాస్త్రాలన్నింటి సారాన్ని అర్థం చేయిస్తారు. ఇక్కడ గర్భ జైలులో ఉంటారు కనుక మమ్మల్ని బయటకు తీయండి, మేము ఇంకెప్పుడూ పాపాలు చేయము అని అంటారు. కానీ రావణుని ప్రపంచంలో పాపాలైతే జరుగుతూనే ఉంటాయి. మళ్ళీ పాపాలు చేయడం మొదలుపెడతారు. మీరు అర్ధకల్పం జైలు పక్షులుగా అయిపోతారు. దొంగలను జైలు పక్షులని అంటారు. వారు జైలు నుండి బయటకు వస్తూ ఉంటారు, మళ్ళీ దొంగతనాలు చేస్తూ ఉంటారు, మళ్ళీ జైలుకు వెళ్ళాల్సి వస్తుంది, అందుకే వారిని జైలు పక్షులని అంటారు. ఇది రావణ రాజ్యమని తండ్రి అర్థం చేయించారు. అక్కడ ఈ విషయాలేవీ ఉండవు. అది రామ రాజ్యము. అక్కడ గర్భ జైలు ఉండదు మరియు ఆ స్థూలమైన జైలు కూడా ఉండదు. ఇక్కడైతే ఎంతమంది మనుష్యులు జైలులో పడి ఉంటారు. ఇక్కడ గర్భ జైలు ఉంది మరియు ఆ స్థూలమైన జైలు కూడా ఉంది. ఇక్కడ డబల్ జైలు ఉంటుంది. ఇది కలియుగాంతము కదా.

ఇప్పుడు పిల్లలైన మీరు నిర్మాణం చేస్తున్నారని తండ్రి అర్థం చేయిస్తారు. ఉన్నతి మరియు పతనము, ప్రతి కల్పం జరుగుతూనే ఉంటాయి. ప్రపంచమే ఉన్నతి చెందుతుంది మరియు పతనమవుతుంది. ఇందులో ముఖ్యమైన పాత్ర భారత్ కు ఉంది. ఆత్మ, పరమాత్మ చాలాకాలం వేరుగా ఉన్నారు..... అని పాడుతూ ఉంటారు కూడా. మరి దీనికి కూడా లెక్క ఉండాలి కదా. ఏ ఆత్మలు చాలాకాలం నుండి వేరుగా ఉన్నారు. మొట్టమొదట దేవీ-దేవతా ధర్మానికి చెందిన ఆత్మలు పాత్రను అభినయించేందుకు వస్తారు. ఇప్పుడు ఆ దేవతలు లేరు. ఒకప్పుడు రాజ్యం చేసి వెళ్ళినవారి చిత్రాలు వారికి గుర్తుగా ఉంటాయి. రాజ్యమైతే సమాప్తమైపోయింది. స్వర్గం సమాప్తమైపోతే నరకం వస్తుంది, తర్వాత నరకం సమాప్తమైపోతే స్వర్గం తయారవుతుంది. కనుక కొత్త ప్రపంచ నిర్మాణం జరుగుతుంది మరియు నరకం యొక్క వినాశనం జరుగుతుంది. నిర్మాణం కొరకు పిల్లలు కావాలి కదా! అక్కడ ఉండబోయేది కూడా మీరే. ముందు మీరు దైవీ గుణాలు కల దేవతలుగా అవ్వాల్సి ఉంటుంది. మనుష్యుల నుండి దేవతలుగా...... అనే మహిమ కూడా ఉంది. మనుష్యులే అశుద్ధంగా అయ్యారు కదా. భగవానువాచ - గృహస్థ వ్యవహారంలో ఉంటూ కమలపుష్ప సమానంగా అవ్వాలి. ఇది ఈ మృత్యులోకంలోని అంతిమ జన్మ. ఇందులో పవిత్రంగా అవ్వాలి. ఈ విషయాన్ని మంచి రీతిగా అర్థం చేయించాలి. మనం ఈ మృత్యులోకంలోని అంతిమ జన్మలో పవిత్రంగా ఉంటాము. ఈ వికారాలపై విజయం పొందడంతో మీరు విశ్వానికి యజమానులుగా అవుతారని తండ్రి అంటారు. ఈ పాత ప్రపంచ వినాశనం ఎదురుగా నిలబడి ఉందని పిల్లలు కూడా విని, తర్వాత ఇతరులకు అర్థం చేయిస్తారు. ఇది అదే మహాభారత యుద్ధము, కామము మహాశత్రువు, అందుకే ప్రతిజ్ఞ చేయండి. మనం పవిత్రంగా అవుతామని ఇప్పుడు మీరు అర్థం చేసుకున్నారు. ఈ పాత ప్రపంచం తప్పకుండా వినాశనమవుతుంది. దాని కంటే ముందే తప్పకుండా పవిత్రంగా అవ్వాలి. వినాశనం జరిగినప్పుడు

హాహాకారాలు జరుగుతాయి, చాలా కఠినమైన మృత్యువు ఉంటుంది, ఇక అడగకండి. మీరు దానిని చూడలేరు కూడా. ఎవరికైనా ఆపరేషన్ జరిగేటప్పుడు, బలహీనమైనవారు అక్కడ ఉండలేరు, పడిపోతారు. అందుకే డాక్టర్లు పరివారం వారిని లోపలికి అనుమతించరు. మరి ఇక్కడ ఎంత భారీ ఆపరేషన్ జరగనున్నది. ఒకరినొకరు హతమార్చుకుంటూ ఉంటారు. ఇది అశుద్ధ ప్రపంచము, ముళ్ళ అడవి. సత్యయుగాన్ని పూల తోట అని అంటారు. దేవతలు చైతన్యమైన పుష్పాలు కదా. స్వర్గంలో ఏదో పూల తోట ఉంటుందని మనుష్యులు భావిస్తారు. వారు ఏది వింటే దాని గురించి మాట్లాడుతూ ఉంటారు. గార్డెన్ ఆఫ్ అల్లాహ్ (భగవంతుని పూలతోట) అని అంటారు కదా కావున వారు ధ్యానంలో కూడా పూలతోటనే చూస్తారు మరియు అల్లాహ్ నా చేతికి పుష్పాన్ని ఇచ్చారని అంటారు. బుద్ధిలో భగవంతుని పూలతోట ఉంటుంది. భక్తి మార్గంలో సాక్షాత్కారాలు పొందేందుకు భక్తి చేస్తారు. సాక్షాత్కారం జరిగితే, సర్వవ్యాపి కదా అని అంటారు. ఏదైతే గతించిందో, అది మళ్ళీ జరుగుతుంది. పిల్లలు ఏ వస్త్రాలతో, ఎలా వచ్చారో, అవే వస్త్రాలతో మళ్ళీ కల్పం తర్వాత వస్తారు. కొందరు డ్రామాను మంచి రీతిగా అర్థం చేసుకుంటారు. బాబా వద్దకు ఎవరైనా వచ్చినప్పుడు, ఇంతకుముందు ఎప్పుడైనా వచ్చారా అని బాబా అడుగుతారు. దానికి వారు - అవును బాబా, కల్పక్రితం కూడా మిమ్మల్ని కలిసాము, మీ నుండి వారసత్వాన్ని తీసుకునేందుకు వచ్చాము అని అంటారు. అప్పుడు తండ్రి, ఏ పదవిని పొందారు అని అడుగుతారు. బాబా-మమ్మా అని అంటున్నారంటే తప్పకుండా వారి వంశంలోకి వస్తారు. ఉన్నత పదవిని పొందే పురుషార్థం చేయండి అని బాబా అంటారు. ఈ విషయాలన్నీ మీ బుద్ధిలో ఉన్నాయి. తప్పకుండా యుద్ధం కూడా జరుగుతుంది. నరకం యొక్క వినాశనం జరగాల్సిందే. మీ వద్ద చాలా ఫస్ట్ క్లాస్ చిత్రాలున్నాయి. రెండు గోళాలు కల కృష్ణుని చిత్రాన్ని కూడా ముద్రించాలి, ఇందులో చాలా స్పష్టంగా ఉంది. స్వర్గ ద్వారాలు తెరుచుకుంటున్నాయి మరియు నరకాన్ని కాలదన్నుతున్నట్లుగా ఉంటుంది. మీ ముఖం కూడా స్వర్గం వైపు ఉంది. ఇది చాలా ఏక్యురేట్ విషయము. ఇప్పుడు మనం ఇంటికి వెళ్ళాలి కనుక ఇంటినే స్మృతి చేయాల్సి ఉంటుంది. పాత ప్రపంచాన్ని మర్చిపోవాల్సి ఉంటుంది. దీనినే అనంతమైన వైరాగ్యమని అంటారు. పాత ప్రపంచాన్ని వదిలి మనం బాబా వద్దకు వెళ్తాము. స్మృతి యాత్ర ద్వారానే వెళ్తాము. ముఖ్యమైనది స్మృతి విషయమే. స్మృతి అయితే అందరూ చేస్తారు కదా. నన్ను స్మృతి చేయండి అని ఇప్పుడు తండ్రి వచ్చి యథార్థమైన విషయాన్ని అర్థం చేయిస్తారు. ఇది అవ్యభిచారీ స్మృతి, ఇది అర్థవంతమైనది. శివబాబా కూడా బిందువేనని మీకు తెలుసు. స్వయాన్ని కూడా ఆత్మ బిందువుగా భావించాలి, తండ్రిని కూడా బిందువుగా భావించాలి. ఇది కొత్త విషయం కావున మర్చిపోతారు. స్వయాన్ని ఆత్మగా భావిస్తూ తండ్రిని మరియు తమ ఇంటిని స్మృతి చేయాలి. అచ్చా, బిందువు చిన్నగా అనిపిస్తుంది, ఇల్లు అయితే పెద్దదే కదా. ఇంటిని గుర్తు చేయండి. బాబా కూడా అక్కడే ఉంటారు. తండ్రి ఎక్కడైతే ఉంటారో, అక్కడకు నేను, మీరు అందరము వెళ్తాము. బిందువు గుర్తుండకపోతే, అచ్చా, కనీసం ఇల్లు అయినా గుర్తుంటుంది కదా. అది శాంతిధామము, మరొకటి సుఖధామము. ఇది దుఃఖధామము. ఇప్పుడు మీరు నంబరువారు పురుషార్థానుసారంగా చదువుకుంటున్నారు, తర్వాత సుఖధామంలోకి వచ్చేస్తారు. మీరు తండ్రికి పిల్లలు కనుక తప్పకుండా స్వర్గ రాజ్యాధికారం కావాలి. కల్పక్రితం కూడా శివబాబా వచ్చారు, స్వర్గ రాజ్యాధికారాన్ని ఇచ్చారు. మీరు మర్చిపోయారు. తండ్రి అంటారు - ఇప్పుడు మళ్ళీ మీకు ఇవ్వడానికి వచ్చాను. మీరు ఎన్నిసార్లు రాజ్యాన్ని తీసుకున్నారు మరియు పోగొట్టుకున్నారు. లెక్కలేనన్ని సార్లు వారసత్వాన్ని తీసుకున్నారు. అయినా సరే, ఇటువంటి తండ్రిని మీరు ఎందుకు మర్చిపోతున్నారు! మాయా తుఫానుల వల్ల చాలా యుద్ధాలు జరుగుతూ ఉంటాయి. అందుకే, మాయ అటువైపుకు లాగుతున్నట్లుగా, ప్రభువు ఇటువైపుకు లాగుతున్నట్లుగా నాటకాన్ని కూడా చూపిస్తారు. జ్ఞానంలో విఘ్నాలు కలగవు. స్మృతిలో విఘ్నాలు కలుగుతాయి. ఇందులోనే శ్రమ ఉంది. మహారథులుగా అవ్వండి అని ఇప్పుడు తండ్రి అంటారు. ఈ పాత ప్రపంచానికి నిప్పు అంటుకోనున్నది. ఈ యజ్ఞంలో మొత్తం పాత ప్రపంచం స్వాహా అవ్వనున్నది కనుక మహావీరులుగా కూడా అవ్వాలి. పిల్లలైన మీరు అఖండమైన, స్థిరమైన, అచలమైన రాజ్యాన్ని పొందాలి. మీ బుద్ధి యోగం తండ్రితో ఎలా ఉండాలంటే, ఎన్ని తుఫాన్లు వచ్చినా సరే, మాయ ఏమీ చేయలేకపోవాలి. ట్రాన్స్ఫర్ అయ్యే సమయానికి ఇది మీ అంతిమ అవస్థ అవుతుంది. ఎలాగైతే స్కూల్లో పరీక్షలు చివర్లో జరుగుతాయో, అలా మీ మాల కూడా చివర్లో తయారవుతుంది. ఫలానావారు ఇలా అవుతారు, ఫలానావారు అలా అవుతారు అని మీకు చాలా సాక్షాత్కారాలు జరుగుతాయి. వీరు దాసిగా అవుతారు..... ఇలా అన్నీ చెప్తారు. కానీ ఆ సమయంలో ఏమీ చేయలేరు. అప్పుడిక మేము ఇలా చేసామేమిటి, శ్రీమతంపై ఎందుకు నడుచుకోలేదు అని పశ్చాత్తాపపడాల్సి ఉంటుంది. కానీ అంతిమ సమయంలో ఏమీ చేయలేరు. ఇలా చాలామంది పశ్చాత్తాపపడతారు. మనుష్యులు ఎవరినైనా హత్య చేసి, ఆ తర్వాత పశ్చాత్తాపపడతారు. కానీ హత్య అయితే జరిగిపోయింది కదా, అప్పుడిక ఏం చేయగలరు. అందుకే తండ్రి అంటారు - పొరపాట్లు చేయకండి, మీ పురుషార్థం చేస్తూ ఉండండి. అచ్చా.

మధురాతి మధురమైన ఆత్మిక పిల్లలకు మాత-పిత, బాప్ దాదాల ప్రియస్మృతులు మరియు గుడ్ మార్నింగ్. ఆత్మిక పిల్లలకు ఆత్మిక తండ్రి నమస్తే.

ధారణ కొరకు ముఖ్య సారము:-

1. 84 జన్మల నాటకం ఇప్పుడు పూర్తవుతుంది, తిరిగి ఇంటికి వెళ్ళాలి. అందుకే, ఆత్మాభిమానులుగా ఉంటూ పావనంగా అవ్వాలి. దేహాభిమానాన్ని తొలగించుకోవాలి.

2. అర్థ సహితంగా స్వయాన్ని ఆత్మ బిందువుగా భావిస్తూ బిందుపైన తండ్రి యొక్క అవ్యభిచారీ స్మృతిలో ఉండాలి. మహావీరులుగా అయి తమ అవస్థను స్థిరంగా-అచలంగా చేసుకోవాలి.

వరదానము:- సర్వాత్మల పట్ల స్నేహం మరియు శుభచింతక భావననుంచే దేహీ-అభిమాని భవ

ఎలాగైతే మహిమ చేసే ఆత్మ పట్ల స్నేహ భావన ఉంటుందో, అలా ఎవరైనా శిక్షణకు సంబంధించిన సూచనను ఇచ్చినట్లయితే, అప్పుడు కూడా ఆ ఆత్మ పట్ల - వీరు నా కొరకు చాలా పెద్ద శుభచింతకులు అనే స్నేహ భావన, శుభచింతక భావన ఉండాలి. ఇటువంటి స్థితిని దేహీ-అభిమాని స్థితి అని అంటారు. ఒకవేళ దేహీ-అభిమానులుగా లేరు అంటే తప్పకుండా అభిమానం ఉన్నట్లు. అభిమానం ఉన్నవారు ఎప్పుడూ తమ అవమానాన్ని సహించలేరు.

స్లోగన్:- సదా పరమాత్మ ప్రేమలో లీనమై ఉన్నట్లయితే, దుఃఖాల ప్రపంచాన్ని మర్చిపోతారు.